ప్రజాశక్తి

శుక్రవారం 12 డిసెంబర్ 2025 5 అనంతపురం

ధర్మవరంలో స్క్రబ్ టైఫస్ కేసు

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలో స్క్రబ్ టైఫస్ కేసు నమోదు అయ్యింది. పట్టణంలో శాంతి నగర్‌కు చెందిన చౌడమ్మ (79)కి స్క్రబ్ టైఫస్ వ్యాధి సోకిందని ప్రభుత్వాసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్ తెలిపారు. చౌడమ్మ ఈనెల 4వ తేదీన జ్వరం, వాంతులు, కాళ్ల నొప్పులతో ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరిందన్నారు. జ్వరం తగ్గకపోవడంతో అనుమానంతో ఈ నెల 8వ తేదీ రాపిడ్ టెస్ట్ చేయగా స్క్రబ్ టైఫస్ అనుమానిత లక్షణాలు వచ్చాయన్నారు. తదుపరి పరీక్షల నిమిత్తం అనంతపురం మెడికల్ కళాశాలకు పంపగా 10న స్క్రబ్ టైఫస్ అని నిర్ధారణ అయ్యిందన్నారు. ప్రస్తుతం ఆమెకు ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య చికిత్సలు అందిస్తున్నామని తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందన్నారు. ఐదు రోజుల కంటే ఎక్కువగా జ్వరం రావడం, శరీరంపై నల్ల మచ్చ, తలనొప్పి, ఒళ్ళు నొప్పులు, శ్వాసలో ఇబ్బంది లాంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించుకోవాలని తెలిపారు.

సికిందర్‌కు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

పోరాట స్ఫూర్తి సికిందర్

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

సిపిఎం నగర నాయకులు, ఆవాజ్ నగర అధ్యక్షులుగా ప్రజా పోరాటాల్లో పాల్గొని అమరుడైన కామ్రేడ్ సికిందర్ ప్రజా పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప అన్నారు. సికిందర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని గణేనాయక్ భవన్‌లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సికిందర్ పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఓ.నల్లప్ప మాట్లాడుతూ సికిందర్ పేదరికం నుంచి వచ్చి సిపిఎంలో అనేక ఉద్యమాలు చేశారని గుర్తు చేశారు. ఆటో కార్మిక సమస్యల పట్ల, మైనార్టీ వర్గాల సమస్యల పట్ల సికిందర్ ఎప్పుడు ముందే డేవాడని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకించడంలో సికిందర్ ముందు బాగానే ఉండి ప్రజలను చైతన్యవంతం చేసేవాడిని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వి.రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు ప్రకాష్, వెంకట నారాయణ, వలీ, మసూద్, ఇర్ఫాన్, బుల్లె రాజు, ఎన్టీఆర్ శీన, అశ్విని, డేవిడ్, రామాంజి, సికిందర్ కుటుంబ సభ్యులు దాదు, అలీ, ఇస్మాయిల్, వన్నూరప్ప 2వ రోడ్డు తోపుడు బండ్ల యూనియన్ నాయకులు వినోద్, సూరి, శీను తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు తప్పని బస్సు తిప్పలు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండల కేంద్రమైన బొమ్మనహాల్‌లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పలు గ్రామాల విద్యార్థులు చదువుతున్నారు. వారు ప్రతి రోజూ ఉదయం కళాశాలకు చేరుకోవాలన్నా, సాయంత్రం ఇంటికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా సాయంత్రం కళాశాల ముగిసిన తర్వాత 4 నుంచి 5.50 గంటల లోపు 3 బస్సులు ఈ మార్గంలో వెళ్లినా ఏ ఒక్కటీ ఆపలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదైనా ఓ బస్సు ఆపితే నానా అవస్థలు పడి బస్సు ఎక్కి ప్రయాణించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని వాపోతున్నారు. ఇకనైనా ఆర్టీసీ డిఎం స్పందించి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడపాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సాయంత్రం వేళ బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు

'దుర్గం' పీఠం టిడిపి కైవసం

- చైర్‌పర్సన్‌గా తలారి గౌతమి ఎన్నిక
- 11 ఓట్లకే వైసిపి పరిమితం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

కళ్యాణదుర్గం మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని టీడీపీ కైవసం చేసుకుంది. వారం రోజులుగా చోటు చేసుకున్న రాజకీయాల పరిణామాల అనంతరం ఎన్నికలో టీడీపీ తన బలాన్ని చాటుకుంది. కేవలం 11 మంది కౌన్సిలర్ల బలంతో వైసీపీ ఆగిపోయింది. ఇద్దరు వైసీపీకి చెందిన కౌన్సిలర్లు గైర్హాజరయ్యారు. 11 మంది కౌన్సిలర్లు, ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఎక్స్‌ఆఫిషియో ఓట్లతో టీడీపీ మద్దతుతో ఛైర్మన్‌గా బరిలోదిగిన తలారి గౌతమి 13 ఓట్లతో ఛైర్‌పర్సన్‌గా గెలుపొందింది.

ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి వసంతబాబు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్ ఎన్నిక కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ మద్దతులో ఛైర్మన్‌గా 15వ కౌన్సిలర్ తలారి గౌతమి పోటీలో నిలవగా 21వ వార్డు కౌన్సిలర్ జయం ఫణింద్ర ప్రతిపాదించారు. 24వ కౌన్సిలర్ పూజారి తిమ్మప్ప బలపరిచారు. గౌతమికి మద్దతుగా కౌన్సిలర్లు అనసూయమ్మ, అభిరాం, వెంకటేశులు, నూర్జహాన్, అచ్చుపల్లి అనిత, బాలరాజేశ్వరమ్మ, మహాలక్ష్మి, రాధికరాణి, జయంఫణి, పూజారి తిమ్మప్పలు ఓటేశారు. ఎక్స్ ఆఫిషియో సభ్యులుగా ఉన్న ఎంపి, ఎమ్మెల్యేలు మద్దతు తెలపడంతో గౌతమికి 13 ఓట్లు వచ్చాయి. వైసీపీ నుంచి ఛైర్మన్ అభ్యర్థిగా లక్ష్మన్న బరిలో నిలిచారు. ఈయనకు మద్దతుగా కుర్రరాము, హేమావతి, సుదీప్తి, రాజ్‌కుమార్, ఎరుకుల తిప్పమ్మ, తిరుమల చంద్రమ్మ, గంగమ్మ, లక్ష్మన్న, అర్చన, పూసల భాగ్యమ్మ, పరమేశ్వరప్పలు మద్దతు తెలిపారు. 11 మంది సభ్యులు మాత్రమే మద్దతు తెలిపారు. 13 ఓట్లతో ఛైర్మన్ స్థానాన్ని టిడిపి కైవసం చేసుకుంది.

కీలకంగా ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లు

ఛైర్మన్ ఎన్నికలో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఓటేసిన ఎంపి, ఎమ్మెల్యేల ఓట్లు కీలకం అయ్యాయి. ఛైర్మన్ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న అధికార టిడిపి గతంలో టీడీపీలో చేరిన వైసీపీ సభ్యులతో పాటు వైస్ ఛైర్మన్‌గా ఉన్న జయం ఫణిని టీడీపీలో చేర్చుకున్నారు. గతంలో టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్ గంగమ్మ ఇటీవల వైసీపీ గూటికి చేరింది. బలం తక్కువగా ఉందని భావించిన టీడీపీ వైసీపీలోని ఇద్దరు కౌన్సిలర్లను ఓటింగ్‌కు హాజరుకాకుండా వ్యూహం రచించింది. అయినప్పటికి రెండు పార్టీలకు 11 సభ్యుల ప్రకారం సమానంగా కౌన్సిలర్ల బలం ఉంది. ఈ సమయంలో ఎంపీ, ఎమ్మెల్యే ఓట్లతో టీడీపీ ఛైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుంది. మున్సిపల్ ఛైర్మన్ స్థానాన్ని దక్కించుకున్న టీడీపీ పట్టణంలో భారీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంభికాలక్ష్మినారాయణ, కొత్తగా ఎంపికైన ఛైర్‌పర్సన్ తలారి గౌతమి, కౌన్సిలర్లు, ముఖ్యనాయకులు, కార్యకర్తలు మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణ పురవీధులలో ర్యాలీచేశారు.

ఛైర్‌పర్సన్ తలారి గౌతమి

మున్సిపాలిటీ అభివృద్ధికి సూచిక ఎమ్మెల్యే, ఎంపీలు

ఛైర్‌పర్సన్‌గా టీడీపీకి చెందిన తలారి గౌతమి గెలుపొందడం మున్సిపాల్టీ అభివృద్ధికి సూచిక అంటూ ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబులు తెలియజేశారు. ఎన్నిక అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్, విద్యాశాఖమంత్రి నారాలోకేష్ సారథ్యంలో జరుగుతున్న అభివృద్ధికి కౌన్సిలర్లు మద్దతు తెలపడం హర్షనీయమన్నారు. వైసీపీ నాయకులు పదేపదే కులరాజకీయాలు మాట్లాడుతూ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. ఛైర్మన్ గెలుపునకు సహకరించిన అందరికి రుణపడి ఉంటామని హామీ ఇచ్చారు.

ఛైర్మన్ ఎన్నిక అనంతరం పట్టణంలో ర్యాలీ చేస్తున్న టిడిపి, కూటమి శ్రేణులు

చంద్రబాబు నాయుడుతో బల్లా పల్లవి

అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా

బల్లా పల్లవి

ప్రజాశక్తి-అనంతపురం

బల్లా పల్లవి

అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్‌గా బల్లా పల్లవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సుదీర్ఘకాలంగా ఆమె భర్త బల్లా సురేష్ బల్లా పల్లవి టిడిపిలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. కార్పొరేటర్‌గా సేవలను అందించి డివిజన్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. టిడిపి క్రియాశీలక కార్యక్రమాల్లో క్షేత్రస్థాయిలో పనిచేసే గుర్తింపు పొందారు. ఈ నేపథ్యంలో బల్లా పల్లవిని గుర్తించిన అధినాయకత్వం ఆమెకు మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పదవిని ఇచ్చారు.

రుణపడి ఉంటా : బల్లా పల్లవి

తనకు మార్కెట్‌యార్డు ఛైర్మన్‌గా అవకాశం కల్పించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్, అనంతపురం శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్‌కు రుణపడి ఉంటామని బల్లా పల్లవి తెలిపారు. మార్కెట్‌యార్డు, టిడిపి అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు.

నారా లోకేష్‌తో బల్లా దంపతులు

ఎపిటిఎఫ్ జోనల్ కమిటీ సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు

పట్టణంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఎపిటిఎఫ్) జిల్లా కార్యదర్శి రామాంజనేయులు అధ్యక్షతన రాయదుర్గం జోనల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఉపాధ్యక్షులు మోహన్‌రెడ్డి మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు వంద రోజుల కార్యక్రమాన్ని సెలవులు, పండుగ రోజుల్లో నిర్వహించరాద న్నారు. 2010కి ముందు నియమితులైన ఉపాధ్యాయులను టెట్ నుంచి మినహాయించాలని కోరారు. అనంతరం ఈ నెల 21వ తేదీ జరగనున్న జిల్లా శాఖ ఎన్నికలపై చర్చించారు. సమావేశంలో హెచ్‌ఎం ఆర్.శ్రీనివాసులు, ఆనందరావు, ఎపిటిఎఫ్ పట్టణ శాఖ అధ్యక్షులు రామకృష్ణ, కార్యదర్శి మల్లికార్జున, ఆంజనేయులు, సునీల్, పాండు, సిద్దేశ్వర, ఉపాధ్యాయులు, సభ్యులు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని సిద్దరాంపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం ఎంపిడిఒ విజయభాస్కర్ బృందం పరిశీలించింది. బృందం సభ్యులు కూలీలను పనులకు వచ్చిన సమయం, తిరిగి వెళ్లే సమయం, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల నుంచి పనులు సక్రమంగా కల్పించడం లేదని, రెండు నెలలుగా బిల్లులు ఖాతాలో జమ కాలేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. గడ్డపార, పలుగు, గంపలు, తదితర పనిముట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎంపిడిఒ ఆయా అంశాలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు.

గోళ్ల హోమియోపతి ఆసుపత్రిని కొనసాగించాలి

ప్రజాశక్తి-శెట్టూరు

కళ్యాణదుర్గం మండలంలోని గోళ్ల గ్రామంలో ఉన్న హోమియోపతి ఆసుపత్రిని యథావిధిగా కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ కళ్యాణదుర్గం తాలూకా జెఎసి అధ్యక్షుడు చెలిమప్ప, కళ్యాణదుర్గం మండల టిడిపి కన్వీనర్ గోళ్ల వెంకటేశులు, బాబు సాహెబ్, శివన్న, రామన్న డిమాండ్ చేశారు. వారు మాట్లాడుతూ ఈ ఆసుపత్రి 40 ఏళ్లుగా ప్రజలకు విశేష సేవలు అందిస్తుందన్నారు. అయితే ఇక్కడ గతంలో పని చేసిన ఓ మహిళా డాక్టర్ స్వప్రయోజనాల కోసం వివిధ కారణాలు చేపి రాజకీయ పలుకుబడితో కురుగుంటకు తరలించారని మండిపడ్డారు. అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయాలన్నీ చెలిమప్ప ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లిన నేపథ్యంలో గురువారం డిఎంహెచ్ఒ, వైద్య సిబ్బంది గ్రామంలో ప్రజలను విచారించారు.

ఆర్టీసీ ఎమ్‌డికి జోనల్ ఛైర్మన్ వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

ఎపిఎస్ ఆర్టీసీ రాయలసీమ జోనల్ పరిధిలో ఆర్టీసీ సేవలు మరింత మెరుగయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ రాయలసీమ కడప జోనల్ ఛైర్మన్ పూల నాగరాజు ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావుకు విజ్ఞప్తి చేశారు. నాగరాజు గురువారం విజయవాడలోని ఆర్టీసీ హౌస్‌లో ఎండిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాగరాజు మాట్లాడుతూ గుత్తి, రాయదుర్గం బస్టాండ్లతో పాటు జోనల్ పరిధిలో శిథిలావస్థలో ఉన్న అన్ని బస్ స్టేషన్లను ఆధునీక రించాలని కోరారు. అలాగే రాయదుర్గం నుంచి విజయవాడ, బెంగళూరు నగరాలకు వెన్నెల, సూపర్ లగ్జరీ స్పెషల్ సర్వీస్‌లను ప్రవేశపెట్టాలని కోరారు.

ఆర్టీసీ ఎమ్‌డితో మాట్లాడుతున్న పూల నాగరాజు

'మేడం.. కమీషన్ పెంచండి'.!

ప్రజాశక్తి-రాయదుర్గం

కమీషన్ పెంచాలని కోరుతూ మండలంలోని రేషన్ డీలర్లు రాష్ట్ర ఆహార సలహా కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవికి విజ్ఞప్తి చేశారు. రేషన్ డీలర్ల అసోసియేషన్ ప్రతినిధులు గురువారం ఆమెను పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రస్తుతం క్వింటా బియ్యానికి రూ. 100 కమీషన్ ఇస్తున్నారని, దానిని రూ. 200కు పెంచాలని, నెలకు రూ. 7,500 గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, వికలాంగులకు ప్రతి నెలా 25 నుంచి 30వ తేదీ లోగా వారి ఇంటి వద్దనే నిత్యావసర సరు కులు అందిస్తున్నందున తమకు అదనపు భారం పడుతుందన్నారు. గతంలో ఎండియు ఆపరేటర్లకు హెల్పర్‌ను నియమించి వారికి రూ. 5 వేలు గౌరవ వేతనం ఇచ్చేవారన్నారు. తమకు అలాంటి సదు పాయంతో పాటు హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, జిల్లా అడహక్ కమిటీ సభ్యులు పసుపులేటి వెంకటేశులు, రామాంజనేయులు, మహేష్, తిరుమలేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ సభ్యురాలు మాలాదేవికి వినతి ఇస్తున్న రేషన్ డీలర్లు

పాఠశాల తనిఖీ

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజి మాలాదేవి గురువారం పట్టణంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులకు సరఫరా చేస్తున్న కోడిగుడ్లు, చిక్కీ, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఇంటి నుంచి భోజనం తీసుకుని రాకుండా పాఠశాలలో వండిన ఆహారం తినేలా అలవాటు చేయాలన్నారు. అలాగే గుడ్లు, చిక్కీలు విద్యార్థులకు అందజేసి వాటిని తీసుకునేలా చేయాలన్నారు. మధ్యాహ్న భోజనంపై హెచ్‌ఎం, వంట ఏజెన్సీ నిర్వాహకులు, విద్యార్థులతో మాట్లాడారు. ఆమె వెంట డిప్యూటీ డిఇఒ మల్లారెడ్డి, తదితరులు ఉన్నారు.

నాసిరకంగా మధ్యాహ్న భోజనం

బెలుగుప్ప : ప్రభుత్వం అందించే మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులకు నాసిరకంగా అందిస్తున్నారని ఎపి ఫుడ్ కమిటీ సభ్యులు గంజిమల దేవి ఏజెన్సీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండల పరిధిలోని కాలువపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, రెండు అంగన్వాడీ సెంటర్లతోపాటు చౌకధాన్యం డిపోలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నీళ్లచారు, నీళ్ల పప్పు, ఉడకని అన్నం అందిస్తున్న అందిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ సెంటర్లలో నాణ్యమైన భోజనం అందించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ అనిల్‌కుమార్, డిప్యూటీ డిఇఒ పి.మల్లారెడ్డి, ఎంఇఒ.2 హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు ఉషారాణి, డిప్యూటీ తహశీల్దార్ మసూదన్‌రావు, వెల్ఫేర్ అధికారి రామ్మోహన్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టోర్ రూమ్, కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా.. లేదా.. అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ఎస్ఒ లేమారోజ్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్, వైస్‌ఛైర్మన్ శివ్‌నారాయణ్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అహుడా పరిధిలో ఎస్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్) దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని అహుడా కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఆర్ఎస్ కింద వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే అతిపెద్ద లేఔట్ ధర్మవరం కునుతూరు లేఅవుట్‌లోని ప్లాట్లు కొనుగోలు కోసం వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకోవడానికి అనంతపురం అహుడా కార్యాలయం, ధర్మవరం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేయాలన్నారు. లేఅవుట్‌లలో మూడేళ్లు దాటినా చెప్పిన ప్రకారం పనులు చేయని డెవెలపర్లు, రియల్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణలో మరింత పురోగతి సాధించాలన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే)లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అహుడా సెక్రటరీ రామకృష్ణారెడ్డి, ప్లానింగ్ ఆఫీసర్ కెఎండి.ఇషాక్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దుష్యంత్, డిఇ రేవంత్, జెపిఒ హరీష్‌చౌదరి, సర్వేయర్ శరత్, ఏఓ రవిచంద్రన్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం

ప్రజాశక్తి-రాయదుర్గం

ఓటరు జాబితాపై గురువారం నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎన్.రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఓ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులన్నారు. కొత్త ఓటరుగా నమోదు చేసుకునే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుంద న్నారు. బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు జాబితాలను తప్పులు లేకుండా తయారు చేయడం, ఇతర అంశాలపై సమావేశంలో చర్చించారు. సమావేశంలో తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, ఎన్నికల సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈఆర్ఓ రవిశంకర్‌రెడ్డి

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

చెరువులకు సాగునీరు అందిస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గుత్తి

నియోజక వర్గంలోని చెరువులన్నింటినీ నీటితో నింపి సాగుకు అందిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. గురువారం మండలంలోని చెర్లోపల్లి సమీపంలో ఉన్న చంద్రాయినికుంట రిజర్వాయర్ వద్ద ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి సాగునీరు విడుదల చేశారు. తర్వాత పూలకుంటకు వెళ్లే రహదారిలో ధ్వంసమైన కల్వర్టులను పరిశీలించి నూతన కల్వర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలను తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం సేవాఘడ్‌లోని టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రాయినికుంట రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తే పి.ఎర్రగుడి, అయ్యవారిపల్లి, బ్రాహ్మణపల్లి చెరువులు నిండుతాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటై 18 నెలల్లో సీఎం చంద్రబాబు సూపరి పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు ఛైర్మన్ జి.సూర్యప్రతాప్, సర్పంచులు అప్పా వెంకటేష్, యు.లింగమయ్య, ఎంపిటిసి జింకల నారాయణస్వామి, సాగునీటి సంఘం అధ్యక్షులు బి.రామకృష్ణ, అప్పా రామకృష్ణ, నాగరాజుయాదవ్, జి.శ్రీనివాసులు, టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులు బి.లక్ష్మీరంగయ్య, పల్లా సాంబశివ యాదవ్, పట్టణ కార్యదర్శి బి.మారుతీప్రసాద్, నాయకులు ఎస్.బర్ధివలి, బి.రమేష్, ఆర్ఎస్.రాజా, ఎన్.రాజశేఖర్, బి.నారాయణస్వామి, పీట్ల చిరంజీవి, తిమ్మప్ప, తిరుపాలు యాదవ్, ఎ.నరసింహులు, కోనా లక్ష్మణరావు, ఎస్.రామాంజి, ఎ.గోవర్ధన్‌గౌడ్, న్యాయవాది సోము, రంగారెడ్డి యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలి

జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ఎన్ఎస్ఎస్ క్యాంపునకు వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థులు విద్యతోపాటు సేవాగుణం, వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అన్నారు. గురువారం రాప్తాడు మండలంలోని రామినేపల్లిలో అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల జాతీయ సేవ పథకం యూనిట్-3 ఆధ్వర్యంలో ఏడు రోజుల స్పెషల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రజల సమస్యలను తెలుసుకుని, పరిష్కార మార్గాలను సూచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ శారద, అధికారిణి మమత, జాతీయ సేవాపథకం వాలంటీర్లు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఎంపిపి దాసరి సునీత

అభివృద్ధి నివేదికలను చదువుతున్న అధికారులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండలంలోని అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని ఎంపిపి దాసరి సునీత సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సహకారంతో మండలాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, డిప్యూటీ ఎంపిడిఒలు సదాశివ, వ్యవసాయ అధికారి శ్యాంసుందర్‌రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి శైలజ, సుకన్య, హౌసింగ్ డిఇ రామ్మూర్తి, పిఆర్ ఇంజినీర్ మద్దిలేటి, నాగేంద్ర, ఎంఇఒ లింగానాయక్, ఎపిఒ సుజాత, బుక్కరాయసముద్రం మేజర్ పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

పోస్టర్లను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు, హమాలీలు

ప్రజాశక్తి-అనంతపురం

విశాఖలోని ఆర్‌కె బీచ్‌లో జనవరి 4వతేదీన నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు వెంకట నారాయణ పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ హమాలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలని, ప్రమాదంలో గాయపడిన, చనిపోయిన కార్మికులకు బీమా ఇవ్వాలని, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇచ్చి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని మహాసభల్లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు రామదాసు, శ్రీనివాసులు, నూర్‌బాషా, భయపరెడ్డి, నారాయణస్వామి, రాజన్న, కుళ్లాయప్ప, నాగశేషు, నాగరాజు, పెద్దన్న, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

బెలుగుప్ప : సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.నాగమణి పిలుపునిచ్చారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎం.నాగమణి, మండల నాయకులు సుజాత, భీమన్న, వన్నూరు స్వామి, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు

భూమిని సంరక్షించుకుందాం

గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-నార్పల

భూమిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఉప సర్పంచు ఆలం వెంకటన నరసానాయుడు పిలుపునిచ్చారు. గురువారం మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో 'దర్తీమాత బచావో అభియాన్' గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల ప్రయోజనార్థం ప్రభుత్వం ఎరువులపై సబ్సిడీ ఇస్తోందన్నారు. కాలానుగునంగా వ్యవసాయానికి అధికంగా పురుగు మందులు వాడుతునాన్రరన్నారు. ఇందుకు ప్రధాన కారణం రైతుల్లో సరైన వినియోగంపై అవగాహన లోపమే అన్నారు. ఈ సమస్యను ఎదుర్కోవడానికే సుస్థిర వ్యవసాయం, మట్టిపోషక ఆరోగ్యం సంరక్షణ కోసం ప్రభుత్వం 'దర్తీమాత బచావో అభియాన్' అనే కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. గ్రామ స్థాయి కమిటీ ఆధ్వర్యంలో రైతులకు ఎరువుల సమతుల్య వినియోగం, మట్టి ఆరోగ్య కార్డు ఆధారంగా ఖచ్చితమైన ఎరువుల వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ డెవలప్‌మెంట్ అధికారి శ్రీనివాస్, వ్యవసాయ సహాయకురాలు అఖిల, సచివాలయ సిబ్బంది, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో కుదేలైన వ్యవసాయం

ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో వ్యవసాయం కుదేలైందని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైదన్నారు. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు పూర్తయినా ఏ పంటకూ మద్దతు ధర కల్పించలేదని మండిపడ్డారు. ముఖ్యంగా జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా రైతులు కష్టాలు పడుతున్నారన్నారు. విత్తనం నుంచి ఎరువులు, పంట విక్రయం వరకూ రైతాంగం రోడ్డెక్కే పరిస్థితులు వచ్చాయన్నారు. జిల్లాలో ఈఏడాది లక్ష ఎకరాలు బీడుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు చేసిన పంటలు దిగుబడులు రావడం లేదని, వచ్చిన అరకొర పంటను అమ్ముకుందామన్నా గిట్టుబాటు ధరలు లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

భవిష్యత్తు ప్రణాళికపై అవగాహన

శిక్షణకు హాజరైన మహిళలు

నార్పల : విజన్ బిల్డింగ్ మాడ్యూల్-1, ఎంసిఎల్ఎఫ్‌లో భాగంగా గురువారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండలంలోనిగ్రామైక్య సంఘాల లీడర్లకు భవిష్యత్తు ప్రణాళిక రూపొందించడంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్య సుస్థిర జీవనోపాధులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు మైత్రి కార్యదర్శి చంద్రకళ, కోశాధికారి వెంకట రమణమ్మ, స్త్రీనిధి డీజీఎం శశికుమార్, ఎజిఎం సాగర్, ఎస్ఎన్ మేనేజర్ రాజశేఖర్, ఎపిఎం తిప్పమ్మ, ఎలొసి సీసీ వేణుగోపాల్‌రెడ్డి, సీసీలు నాగప్ప, రత్నకుమారి, నాగేష్, నారాయణస్వామి, మహిళా మార్ట్ సీసీ రామకృష్ణ, ఎంఎస్ ఎ.కోటేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో క్రీడాపోటీలు

విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎటిపి-8 బ్రాంచిలో గురువారం ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్‌ను ఎజిఎం సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు అతిథులు పతకాలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, హైస్కూల్ కోఆర్డినేటర్ నాగభూషణం, డీన్ సుప్రజ, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, ప్రీ ప్రైమరీ కోఆర్డినేటర్ సబిత, పిఇటిలు శివప్రకాష్, సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలి

డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు

ధర్నా చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణంలోని విద్యాసంస్థల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని డివైఎఫ్ఐ పట్టణ ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం డివైఎఫ్ఐ నాయకులు స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని విద్యాసంస్థలకు రోజూ గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు రావడానికి బస్సుపాసులు పొంది బస్సుల్లో వస్తున్నారన్నారు. అయితే బస్సులు సమయానికి రాకపోవడంతో పాఠశాలలు, కళాశాలలకు సమయానికి వెళ్లలేక పోతున్నారన్నారు. బస్సుల్లో కాకుండా ఆటోలో ఇతర వాహనాల్లో వస్తుండటంతో విద్యార్థులు ప్రమాదాల బారినపడే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి విద్యాసంస్థల సమయాలకు అనుగుణంగా బస్సులను నడపాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు రంగా, జయరాం, శ్రీకాంత్, లోకేష్, సుమన్, తిమ్మరాజు, అంజి, రాజేష్, వంశీ, సాగర్, పవన్, ఓబులేష్, తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశం వాయిదా

పుట్లూరు : మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడినట్లు ఎంపిడిఒ అలివేలమ్మ తెలిపారు. సర్వసభ సమావేశానికి ఎంపిపితోపాటు ఎంపిటిసిలు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. వాయిదా పడిన సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కనీసం శుక్రవారం అయినా సమావేశం నిర్వహించి మండల సమస్యలపై చర్చించేరా.. అని మండల వాసులు చర్చించుకుంటున్నారు.

ఉద్యోగాల భర్తీ మెరిట్ లిస్ట్ విడుదల

అనంతపురం : వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగాలు భర్తీ కోసం దరఖాస్తు చేసుకున్న వారి మెరిట్ జాబితాను గురువారం విడుదల చేసినట్లు డిఎంహెచ్ఒ ఇబి దేవి తెలిపారు. ఇందుకు సంబంధించిన జాబితా వెబ్‌సైట్ www.anantapuramu.ap.gov.inలో ఉంచినట్లు తెలిపారు.

ఎపి ఎంపిఎ మండల అధ్యక్షుడి రాజీనామా

పామిడి : ఎపి ఎంపిఎ పామిడి మండల అధ్యక్షులు డాక్టర్ నాగమల్లారెడ్డి గురువారం పదవికి రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా తాను అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా పని చేస్తున్నట్లు తెలిపారు. అయితే అనారోగ్య కారణాలతో రాజీనామా చేసినట్లు తెలిపారు.

నేడు ప్రజాదర్బార్

యల్లనూరు : మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కరుణసాగర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'బిల్డింగ్ పీనలైజేషన్'ను సద్వినియోగం చేసుకోండి

అనంతపురం : 'బిల్డింగ్ పీనలైజేషన్ – లే అవుట్ రెగ్యులరైజేషన్' స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం రూరల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారి పి.దివాకర్, డిప్యూటీ ఎంపిడిఒ వెంకటనాయుడు తెలిపారు. గురువారం అనంతపురం రూరల్ మండల పరిధిలోని రాజీవ్‌కాలనీ, ఎ.నారాయణపురం గ్రామ పంచాయతీల్లో నిర్మాణంలో ఉన్న బహుళ అంతస్తు భవనాలు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలను పరిశీలించారు.

నార్పల తహశీల్దార్ బదిలీ

నార్పల : మండల తహశీల్దార్‌గా పని చేస్తున్న తహశీల్దార్ అరుణకుమారి బదిలీ అయ్యారు. దీంతో డిప్యూటీ తహశీల్దార్‌గా పని చేస్తున్న ప్రకాష్‌రావుకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం.

వాహనాల తనిఖీ

అనంతపురం : ఎస్పీ పి.జగదీష్ ఆదేశాల మేరకు నగరంలోని కళ్యాణదుర్గం బైపాస్ ప్రాంతంలో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో నాల్గవ పట్టణ పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఇందులో భాగంగా అనుమానాస్పద వాహనాలను ఆపి బ్రీత్ అనలైజర్‌తో చెక్ చేసి పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నారు.

పంట బీమాపై అవగాహన

బెలుగుప్ప : మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సెంట్రల్ బీమా కంపెనీ డివిజన్ కో ఆర్డినేటర్ సయ్యద్ నబిరసూల్ ఆధ్వర్యంలో పప్పుశనగ పంట బీమాపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిఇఒ పాండురంగ, మాజీ ఎంపిటిసి కంచి రాముడు, ఈశ్వర్, తిమ్మప్ప, సంజీవులు, లింగన్న, రాజశేఖర్ పాల్గొన్నారు.

కళాకారుని మృతికి నివాళి

పామిడి : మండలంలోని ఓబుళాపురం గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు హుస్సేన్ పీరా అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తోటి కళాకారులు అతని స్వగృహానికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో పామిడి షిరిడీ సాయిబాబా నాటక కళా సమితి ప్రధాన కార్యదర్శి టి.నాగరాజు, సర్పంచులు దామోదర్‌రెడ్డి, సూర్యనారాయణ, ఓబులేష్, షిరిడీ సాయిబాబా నాటక కళా సమితి అధ్యక్షుడు సి. వెంకటరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పామిరెడ్డి, కోశాధికారి నాగరాజు, హార్మోనిస్ట్ సుంకన్న, క్లార్నెట్ మాణిక్యం, తబలిస్ట్ వెంకటేష్, కళాకారులు చంద్రశేఖర్‌రెడ్డి ఉన్నారు.

హుస్సేన్‌పీరాకు నివాళులర్పిస్తున్న కళాకారులు

'ఉపాధి' పనులు కల్పించాలని వినతి

ప్రజాశక్తి-కూడేరు

మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం కింద కూలీలకు పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం మండల కేంద్రంలోని కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎపిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో కొన్ని గ్రామాల్లో మాత్రమే ఉపాధి పనులు కల్పిస్తున్నారన్నారు. దీంతో చాలామంది కూలీలు పనుల్లేక వలసలు పోతున్నారన్నారు. కావున గ్రామాల్లో వెంటనే ఉపాధి పనులు కల్పించి వలసలను నివారించాలని కోరారు. లేనిపక్షంలో కూలీలను సమీకరించి పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం మండల కార్యదర్శి ఖరీం, రాధాకష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మరమ్మతులు చేయండి

వినతిపత్రం అందజేస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహ భవనాలకు మరమ్మతులు చేపట్టాలని వైసిపి ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల విద్యాధికారి బి.రవినాయక్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని చాలా పాఠశాలల భవనాల పైకప్పు పెచ్చులు ఊడి కింద పడుతున్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పాఠశాల భవనాలు దెబ్బతిన్నాయని చెప్పారు. గతంలో వైసిపి ప్రభుత్వం నాడు నేడు పథకం కింద రాష్ట్రంలో అనేక పాఠశాలలకు నూతన భవనాలు, అదనపు గదులు నిర్మించారని చెప్పారు. పాఠశాల గదుల్లో బెంచీలు ఏర్పాటు చేశారన్నారు. డిజిటల్ తరగతుల గదులను నిర్మించారన్నారు. చాలా పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాఠశాలల మరమ్మతులు కూడా నిధులు విడుదల చేయడం లేదని విమర్శించారు. పాఠశాలల గురించి ప్రభుత్వం పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం అధ్యక్షుడు ఇమ్రాన్, నాయకులు నాసిర్, సుభాష్ చంద్రబోస్ రెడ్డి, మధుబాబు, షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు ప్రారంభం

రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభిస్తున్న శైలజనాథ్

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రంలో వెలసిన గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకుని గురువారం ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీలను వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజనాథ్ ప్రారంభించారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు కొత్తమిద్దె ఓబులేసు, మాజీ సర్పంచు కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శైలజనాథ్, సతీమణి డాక్టర్ మోక్షప్రసూన అమ్మవారి పూజలు చేసి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. అనంతరం రాతిదూలం లాగుడు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బోగాతి విజయ్ ప్రతాప్‌రెడ్డి, వైసిపి నాయకులు కల్లూరు ప్రతాప్‌రెడ్డి, మండల కన్వీనర్ శివశంకర్, జిల్లా కార్యదర్శి విష్ణునారాయణ, పూల ప్రసాద్, దొడ్లో కిరణ్‌కుమార్, దొడ్లో బాబు, చిన్న ఓబులేసు, రమణ, పెద్దిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కంటి జబ్బులపై నిర్లక్ష్యం వద్దు

కంటి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

బుక్కరాయసముద్రం : కంటి జబ్బులపై నిర్లక్ష్యం చేస్తే జీవితం చీకటి మయం అవుతుందని కంటి డాక్టర్ హరిప్రసాద్, డిప్యూటీ హెల్త్ఆఫీసర్ ఎస్.పర్వీన్ సూచించారు. రాష్ట్రీయ బాలల స్వస్థ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొర్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కెకె అగ్రహారంలోని పాఠశాల, చెన్నంపల్లి పాఠశాలల్లో విద్యార్థులకు కంటిపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటి లోపాలు ఉంటే పరీక్షలు చేయించుకుని కంటి అద్దాలు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది ఎంఎల్‌హెచ్‌పి కల్పన, హెప్సిబా, ఎఎన్ఎంలు మల్లేశ్వరమ్మ, మహేశ్వరి, లలిత, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ఎరువులను తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం : జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు గుత్తి ఎడిఎ వెంకటరాముడు అనంతపురం మండల వ్యవసాయ అధికారి ఏ.వెంకటకుమార్ గురువారం ఎరువుల దుకాణాలను తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా సుముఖ ఫార్మ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ దుకాణంలో 11.81 టన్నుల డ్రిప్ ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు.

చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలి

సూచనలిస్తున్న వైద్యాధికారి

ప్రజాశక్తి-ఆత్మకూరు

మండలంలోని ఆరేళ్లలోపు చిన్నారులు అందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని మండల వైద్యాధికారిణి సుబిహా సుల్తానా సూచించారు. గురువారం మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పల్స్ పోలియో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ మండలంలోని చిన్నారులకు పోలియో చుక్కలు వేసేందుకు 34 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కేంద్రాల పరిధిలో వందశాతం చుక్కలు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.లక్ష్మీనరసింహా, నరసింహారెడ్డి, రామాంజనేయులు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

పేదలందరికీ ఇళ్ల పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి-గుత్తి

పట్టణంలోని 327 సర్వే నంబర్లు గుడిసెలు వేసుకున్న పేదలందరికీ పట్టాలు ఇవ్వాలని సిపిఎం మండల కార్యదర్శి వి.నిర్మల కోరారు. ఈమేరకు గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ఉప తహశీల్దార్ ఎంకె.సూర్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని నెలలుగా పేదలు గుడిసెలు వేసుకున్నారని చెప్పారు. పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి ఎన్. రేణుక, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.మల్లేష్, కెవిపిఎస్ మండల కార్యదర్శి యు.మల్లికార్జున, సిఐటియు సహాయ కార్యదర్శి సి.రమేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి నవీన్ యాదవ్, సిపిఎం నాయకులు నారాయణస్వామి, రామేశ్వరి, వన్నూరమ్మ, ఊర్మిళ, జయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్‌పై శిక్షణ

పుట్లూరు : మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయంలో విజన్ బిల్డింగ్‌పై గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు మండలంలో అమలవుతున్న అక్షర ఆంధ్ర కార్యక్రమంపై విఒ లీడర్లు, వివోఏలు, సమాఖ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో వాలంటీర్లు సహనంతో నిరక్షరాస్యులను అక్షరాశులుగా తీర్చిదిద్దాల సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ప్రేమ్‌కుమార్, ఎపిఎం వెంకటరామిరెడ్డి, సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల తొలగింపు

ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

అనంతపురం కార్పొరేషన్ : నగరంలోని నాయక్‌నగర్, ఆర్‌కె నగర్‌లలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అనధికార కట్టడాలను గురువారం తొలగించినట్లు కమిషనర్ బాలస్వామి తెలిపారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది క్షేత్రస్థాయి పరిశీలనలో సర్వే నెం.344/2 బి, నాయక్‌నగర్, సర్వేనెం.124, ఆర్‌కె నగర్‌లో భారీ అనధికారిక నిర్మాణాలను గుర్తించి జెసిబితో తొలగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా కట్టిన కట్టడాలపై తొలగింపు చర్యలు కొనసాగుతాయన్నారు. బిల్డింగ్ ఫీనలైజేషన్ స్కీం ద్వారా ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ వరకూ కట్టిన నిర్మాణాలకు అనుమతులు పొంది, నిబంధనలను అతిక్రమించి కట్టిన అనధికారిక కట్టడాలు, భవనాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు.

ఆలయంలో చోరీ ఘటనపై విచారణ

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ మండలం లోని ఎర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో ఈనెల 7న జరిగిన చోరీ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు డిప్యూటీ కమిషనర్ గురు ప్రసాద్ తెలిపారు. ఈ ఘటనలో లోతైన సమాచారం కోసం గతంలో పనిచేసిన ఈవో ఇతర సిబ్బందిని విచారించడంతో పాటు ఆలయానికి సంబంధించిన నగలు, చీరలు,పలు రికార్డులు పరిశీలించామన్నారు. గంగమ్మ ఆలయంలో నగలు చీరలు చోరీకి యత్నించిన ఈవో మురళీకృష్ణ తో పాటు, ఆయన భార్యపై కూడా విచారణ చేస్తున్నామని చెప్పారు. సీసీ ఫుటేజ్ ఆధారంగా ఈవో మురళీకృష్ణ ను పోలీసులు అరెస్ట్ చేశారని, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఆయనను విధులనుండి సస్పెండ్ చేశారని తెలిపారు. ఈవో వ్యవహారం అవకతవకల పై సమగ్ర విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నేరాలు ఘోరాలు

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

మృతిచెందిన చరణ్

తాడిపత్రి రూరల్ : ముందు వెళ్తున్న లారీ సడన్గా ఆగడంతో వెనుక నుంచి వచ్చిన మోటార్ సైకిల్ ఢీకొన్న ప్రమాదంలో వ్యక్తి మృతిచెందాడు. మరోవ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన గురువారం మండల పరిధిలోని తాడిపత్రి బుగ్గ ప్రధాన రహదారిపై వెంకటరెడ్డిపల్లి గ్రామం వద్ద చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. నంద్యాల జిల్లా అవుకు మండలం రామాపురం గ్రామానికి చెందిన బండి చరణ్ (20), మద్దిలేటి బుగ్గ నుంచి తాడిపత్రి వైపు మోటార్ సైకిల్‌పై వస్తుండగా ముందు వెళ్తున్న సిమెంట్ లారీ సడన్ బ్రేక్ వేయడంతో ఢీకొన్నారు. దీంతో వాహనం నడుపుతున్న చరణ్ అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక ఉన్న మద్దిలేటి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రాయదుర్గం రూరల్ : మండలంలోని టి.వీరాపురం గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. వీరాపురం గ్రామానికి చెందిన ఈశ్వరప్ప(45) ద్విచక్ర వాహనంపై బయల్దేరాడు. రాయదుర్గం నుంచి కణేకల్లుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును గ్రామ సమీపంలోని ఓ మలుపు వద్ద ఓవర్ టేక్ చేయబోయి అదుపుతప్పి బస్సు చక్రాల కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తల ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈశ్వరప్పకు భార్య, ఐదు మంది కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళపై దాడి

పుట్లూరు : మండల పరిధిలోని సూరేపల్లి గ్రామానికి చెందిన కళ్యాణి, ఆమె అత్త రమణమ్మపై దాదాపు 15 మంది దాడి చేసినట్లు బాధితులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కళ్యాణి, ఆమె అత్త రమణమ్మ కలిసి పొలంలో పనులు చేసుకుంటుండగా దాదాపు 15 మంది వచ్చి ఒక్కసారిగా దాడి చేసినట్లు తెలిపారు. ఈమె పొలం పక్కలో ఉన్న ఉమ్మడి బోరు విషయంలో గత కొద్దికాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ విషయంపై పెద్ద మనుషుల ద్వారా పంచాయితీ కూడా చేశారు. అయినప్పటికీ ఉపేంద్ర, వెంకటేష్, రమణక్క, లావణ్యతో పాటు తాడిపత్రికి చెందిన మరికొందరు కలిసి దాడి చేసినట్లు తెలిపారు. దీంతో ఇద్దరినీ చికిత్స కోసం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యవసాయ పైపులైన్ ధ్వంసం

మోటారు వద్ద ధ్వంసమైన పైప్‌లైన్

నార్పల : మండల కేంద్రంలో గిరిజన రైతు గుజ్జల వెంకటరాముడుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పైప్‌లైన్, కేసింగ్ పైపును ధ్వంసం చేసి రెండు మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్ దొంగలించారు. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ ఇప్పటికే నష్టాలపాలవుతున్న నేపథ్యంలో పైప్‌లైన్, కేసింగ్ పైపు ధ్వంసం, రెండు మోటార్లకు అమర్చిన కేబుల్ వైర్‌ను చోరీ చేయడంతో తీవ్రంగా నష్టపోయామన్నారు. దీంతోసుమారు రూ.లక్ష వరకూ నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.